క్లుప్తంగా

కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



జ్యోత్స్నకు ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రంతోపాటు, నగదు బహుమతిని గెలుచుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 541 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో పదో తరగతి విద్యార్థిని పూజారి జ్యోత్స్న రాసిన 'వరించిన అదృష్టం' కథ ప్రోత్సాహక బహుతికి ఎంపికైంది. ఈ బహుమతిని నిర్వాహకులు పోస్టు ద్వారా పాఠశాలకు పంపడంతో సోమవారం హెచ్ఎం నారాయణరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రమోహన్ చేతులమీదుగా విద్యార్థినికి నగదు బహుమతితోపాటు, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తూ అభినందించారు. అలాగే కథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

మున్సిపల్ వర్కర్లకు సన్మానం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలు విజయవంతం కావడానికి సహకరించిన మున్సిపల్ వర్కర్లను సోమవారం సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, చైర్ పర్సన్ వన్నూర్‌బీతో పాటు అధికారులు వారిని శాలువాలతో సత్కరించారు. వర్కర్ల సేవలను కొనియాడారు.

అన్నదానం

గుంతకల్లుటౌన్: మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా అంజుమన్ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు అన్నదానం చేశారు. సోమవారం స్థానిక అంజుమన్ స్ట్రీట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పుర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం వందలాది మందికి అన్నదానం చేశారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ సర్కిల్‌లోని మదీనా ఆర్చ్ వద్ద ముస్లిం మైనార్టీలు వందలాది మందికి అన్నదానం చేశారు.

'చెరువులకు నీరు వదలండి'

శింగనమల: నార్పల మండలంలోని దుగ్గం, దండువారిపల్లిలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, చెరువులకు నీరు విడుదల చేసి ఆదుకోవాలని దుగ్గం సర్పంచ్ రామాంజనేయులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

20 మందిపై కేసు నమోదు

తాడిపత్రి టౌన్: తాడిపత్రి పట్టణంలో టీడీపీ నాయకులు జేసీ ప్రభాకర్ రెడ్డి, కాకర్ల రంగనాథ్ వర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సోమవారం సీఐ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వినాయక నిమజ్జన సందర్భంగా ఆదివారం ఇరువర్గాల అనుచరులు గొడవ పడ్డారన్నారు.

జాతీయ స్థాయిలోనూ రాణించాలి



గౌసియాను అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: త్వరలో ముంబయి వేదికగా జరిగే జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లోనూ విజయం సాధించి జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటాలని తాడిపత్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని గౌసియాకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర స్థాయిలో గత నెల 26న నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ఆమెను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ అభినందించారు. అనంతరం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

కలెక్టర్‌కు గాంధీ చిత్రపటం బహూకరణ



కలెక్టర్‌కు గాంధీ చిత్రపటాన్ని అందజేస్తున్న గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు

గుత్తి: చీరాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రవి జర్మన్ కాన్వాస్‌పై చిత్రీకరించిన మహాత్మా గాంధీ పెయింటింగ్ చిత్ర పటాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు బహూకరించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, సలహాదారులు బాల మురళీకృష్ణ, సాధు శేఖర్, సూర్యనారాయణ రెడ్డి, రంగస్వామి, వీరేష్ సోమవారం అనంతపురం వెళ్లి కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌కు గాంధీ చిత్ర పటాన్ని అందజేశారు. గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులను కలెక్టర్ అభినందించారు.

✦ ఆదమరిస్తే.. అంతే సంగతి



గార్లదిన్నె ప్రధాన కూడలిలో మలుపు వద్ద గుంతలు

పెద్దపప్పూరు: మండలంలోని గార్లదిన్నె ప్రధాన కూడలిలో మలుపు వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. మూడ రోడ్ల కూడలి కావడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే అధికారులు చూస్తూ వెళ్తున్నారే కానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు మండిపడుతున్నారు. అశ్వర్థ క్షేత్రానికి వెళ్లే భక్తులు గుంతల రోడ్డు వల్ల అవస్థలు పడుతున్నారు. వర్షం వడిన సందర్భంలో గుంతల్లో నీళ్లు నిలుస్తుండడంతో.. ఎక్కడ కిందపడిపోతామో నంటూ వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే మండలంలోని పలు రహదారులు గుంతలమయంగా మారాయి. మరమ్మతులు చేయకపోవడంతో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపులో గుంతలను పూడ్చివేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

✦ సాయంత్రమైతే వైద్య సేవలు బంద్!



సాయంత్రానికే ఎద్దులపల్లి పీహెచ్‌సీకి తాళం వేసిన దృశ్యం

పామిడి: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు పేపర్లకే పరిమితమవుతున్నాయి. దీనికి నిలువెత్తు నిదర్శనం పామిడి మండలంలోని ఎద్దులపల్లి పీహెచ్‌సీ. 24 గంటలూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించాలనే ఎద్దులపల్లి సబ్-సెంటర్‌ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా (పీహెచ్‌సీగా) అప్‌గ్రేడ్ చేశారు. అయితే సాయంత్రమవగానే సిబ్బంది ఆస్పత్రికి తాళం వేసి ఇళ్లకు వెళ్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేళకాని వేళ ప్రమాదకర పరిస్థితుల్లో ఆస్పత్రికి వస్తే మూత పడి ఉంటోందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రాణ భయంతో పామిడిలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండి సేవలందించేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

నేమ్ బోర్డులో వైఎస్సార్ పేరు తొలగింపు



మార్కెట్ యార్డులోని రైతు బజార్ నేమ్ బోర్డులో డాక్టర్ వైఎస్సార్ పేరును తొలగించిన దృశ్యం

గుంతకల్లు: స్థానిక మార్కెట్ యార్డులో డాక్టర్ వైఎస్సార్ రైతు బజార్ కేంద్రానికి ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు నుంచి డాక్టర్ వైఎస్సార్ పేరును తొలగించడం వివాదాస్పందగా మారింది. సెప్టెంబర్ 2న దేశవ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించనున్న తరుణంలో గుంతకల్లు మార్కెట్ యార్డులోని నేమ్ బోర్డులో డాక్టర్ వైఎస్సార్ నేమ్ ప్లేట్స్‌ను మాత్రమే తొలగించినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విషయమై మార్కెట్ యార్డు సెక్రటరీ బాలాజీరావును 'సాక్షి' ప్రశ్నించగా బోర్డులోని డాక్టర్ వైఎస్సార్ నేమ్ ప్లేట్స్ ఊడిపడిపోయినట్లు సమాధానమివ్వడం విడ్డూరంగా ఉంది. ఎందుకంటే గత వారంలో కురిసిన భారీ ఈదురుగాలులకు, వర్షాలకు ఏ మాత్రం చెక్కుచెదరని నేమ్ బోర్డు ఇప్పుడు ఉన్నపలంగా డాక్టర్ వైఎస్సార్ పేరు మాత్రమే ఊడిపోవడం వెనుక కూటమి నాయకుల కుట్ర దాగి ఉన్న విషయం స్పష్టమవుతోంది. డాక్టర్ వైఎస్సార్ పేరును తొలగించిన దుండగులపై చర్యలు తీసుకోవడంతోపాటు డాక్టర్ వైఎస్సార్ అక్షరాలను నేమ్ బోర్డులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

18,19న ఎస్ఆర్ఐటీలో జాతీయ సదస్సు



కళాశాలలో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ బిలింగుల్ కాన్ఫరెన్స్ ఆన్ నెక్స్ట్ జెనరేషన్ కన్‌స్ట్రక్షన్ విత్ సస్టైనబుల్ రిలియంట్, అండ్ స్మార్ట్ సివిల్ ఇంజినీరింగ్ (ఎన్‌సీఎస్ఆర్ఏసీ-2025) సంబంధించి ఈ నెల 18, 19న ఏఐసీటీఈ ఏటీఎల్ఎల్-వాని స్కీం జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ తెలిపారు. సోమవారం ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో పోస్టర్లు విడుదల చేశారు. సదస్సుకు కళాశాల కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి, చైర్‌పర్సన్ జొన్నలగడ్డ పద్మావతి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి హాజరవుతారన్నారు. సదస్సులో సబ్జెక్ట్ థీమ్, ద్విభాషా (తెలుగు-ఆంగ్లం) విధానాన్ని అభినందించి పూర్తి స్థాయి సహకారం అందిస్తామన్నారు. సదస్సులో ఆమోదం పొందిన, ప్రదర్శింపబడిన అన్ని పరిశోధనా పత్రాలు రెండు ఐఎస్‌బీఎన్ వాల్యూమ్స్‌లో ఒకటి ఆంగ్లంలో మరొకటి తెలుగులో కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్ రూపంలో ప్రచురిస్తామన్నారు.

నకిలీ విత్తనాలతో నిండా ముంచారు



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

తాడిపత్రి రూరల్: నకిలీ విత్తనాలు అంటగట్టి నిండా ముంచారని రైతులు వాపోయారు. పట్టణంలో వైఎస్సార్ సర్కిల్‌లోని మధుసాయి ట్రేడర్స్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలం శెట్టివారిపల్లికి కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి వెళ్లి తాను తాడిపత్రిలోని మధుసాయి ట్రేడర్స్‌కు చెందిన ఉద్యోగిగా అక్కడి రైతులతో పరిచయం పెంచుకున్నాడు. తమ వద్ద సోహా 007 రకం మొక్కజొన్న విత్తనాలు ఉన్నాయని, 110 రోజుల్లోనే పంట దిగుబడి వస్తుందని ఆశ చూపి 30 మంది రైతులకు అంటగట్టాడు. దీంతో ఎకరాకు రూ.40 వేల నుంచి 45 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులు 90 రోజులు కావస్తున్నా పంట సరిగా ఎదగక పోవడంతో మోసపోయిన గుర్తించి తాడిపత్రికి వచ్చి మధుసాయి ట్రేడర్స్ యజమానికి పరిస్థితి వివరించారు. అయినా ఆయన పట్టించుకోక పోవడంతో బాధిత రైతులు సోమవారం తాడిపత్రికి వచ్చి దుకాణం వద్ద ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేసేంతవరకూ వెళ్లేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న ఏడీఏ రవి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని రైతులకు భరోసానిచ్చారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న శివారెడ్డి, రాయుడు



పెద్దవడుగూరులో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాయుడు, పంట్ల తోటల సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం బీకేఎస్ మండల కేంద్రంలో రైతు సంఘం మహాసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం అందజేయాలన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఏపీ రైతు సంఘం మండల గౌరవాధ్యక్షుడిగా కుళ్లాయప్ప, అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకట కొండ, శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా వి.శివారెడ్డి, నారాయణ స్వామి, సహాయ కార్యదర్శులుగా సంజీవరెడ్డి, హనుమంతు, వరప్రసాద్, వేణు ఎన్నుకున్నారు.

పెద్దవడుగూరు: రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండల సీపీఐ నాయకుడు ఎద్దుల సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం నాయకుడు వెంకట్రాముడుయాదవ్ మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలో రైతుల కోర్కెల దినోత్సవం నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గాంధీ విగ్రహానికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణ, ఉసేన్, పెద్ద నాగేంద్ర, ఆదినరాయణ, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే యూరియా విక్రయించాలి

యల్లనూరు: యూరియా కొరత కారణంగా రైతులతో ఎక్కువ ధరలకు అమ్మినట్లు రుజువైతే షాపును సీజ్ చేస్తామని తహసీల్దారు రాము, ఇన్‌చార్జ్ ఏఓ మధుకుమార్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పుడమి అగ్రిమార్ట్‌ను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎమ్మార్పీకే యూరియా, ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయించాలని డీలర్లకు సూచించారు.

విశిష్ట సేవకులకు సత్కారం



మాట్లాడుతున్న రాయల్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ పసుపుల శ్రీధర్

యాడికి: మండలంలో విశిష్ట సేవలందించిన నలుగురు వ్యక్తులకు యాడికి ఉన్నత పాఠశాలలో రాయల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలంలోని రాలయచెరువు గ్రామానికి చెందిన శ్రీధర్ ఎంటెక్ వరకు చదివి ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. 2019లో రాయల చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయనతోపాటు మైవహెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యుడు బండారు బాలకృష్ణ, యోగాశ్రమ నిర్వాహకుడు గరిడి శివన్న, అనాథాశ్రమం నిర్వాహకుడు వెంకటరాముడును రాయల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం యాడికి ఉన్నత పాఠశాలలో సత్కరించారు. అనంతరం డ్రిల్ టీచర్ సంజీవరాయుడికి రూ.10వేల ఆర్థిక సాయం శ్రీధర్ అందించారు. కార్యక్రమంలోట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు, ఎంఈఓ కాశెప్ప, హెచ్ఎం సీతా రామాంజనేయులు, టీచర్ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవిష్కాంధ్రతో యువతకు కొత్త అవకాశాలు

తాడిపత్రి టౌన్: ఆవిష్కాంధ్ర 2025 యువతకు కొత్త అవకాశాలు ఇస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఆవిష్కాంధ్ర .. ఒక కుటుంబం.. ఒక ఎంట్రీ పిన్యూర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతమైన వ్యాపారాలు స్థాపించడానికి ప్రేరేపిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, వాణిజ్య విభాగం అధిపతి గురుమోహన్, ఉపన్యాసకులు సత్యనారాయణ, విశ్వాసరావు, ఫిజికల్ డైరెక్టర్ జయలక్ష్మి, డాక్టర్ విజయభాస్కర్, పద్మనాభం, ఖాసీంవలి, ఓబుళపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

శింగనమల(నార్పల): గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు సమతుల ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ సూచించారు. సోమవారం నార్పల మండలకేంద్రంలోని సుల్తాన్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆహారంలో చిరుధాన్యాలతోపాటు ఆకుకూరలు, కూరగాయలు విరివిగా తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కాఫీ, టీ తగ్గించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్: బీహార్ ఓటర్ వికాస్ యాత్రలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన మాతృమూర్తిని దూషించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వాసం రవి తదితరులు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ బీజేపీ నాయకులు సోమవారం పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొలిమి రామాంజి, పురంధర్, హరిహరనాథ్, శేఖన్న, రంగన్న, విశ్వనాథ్, సిరాజ్, రామాంజినేయులు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం


కాణిపాకంలో కూచిపూడి ప్రదర్శన



కాణిపాక బ్రహ్మోత్సవాల్లో ప్రతిభ చూపిన పామిడి మండల చిన్నారులు

పామిడి: కాణిపాకంలోని బ్రహ్మోత్సవాల్లో పామిడి మండలానికి చెందిన తొమ్మిది మంది చిన్నారులు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించడంపై సోమవారం మండవాసులు హర్షం వ్యక్తంచేశారు. పర్నిత, నీహాస్వి, శ్రీస్నిగ్ధ రాయల్, హరి శరణ్య, సహస్ర, నాగ సాన్విక, సాయివర్షిణి, దివ్యశ్రీ, దేవరపల్లి గ్రామ చిన్నారులు షణ్ముఖ ప్రియా కూచిపూడి నృత్య నీరాజనంలో అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. చిన్నారులను తీర్చిదిద్దిన కూచిపూడి మాస్టర్ సురేష్‌ను అభినందించారు.

బాలుడి అదృశ్యం



సంతోష్‌కుమార్

గుత్తి: కుమారుడు అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు గుత్తి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. కర్నూలు జిల్లా కోసిగి మండలం పెద్ద తూంబలం గ్రామానికి చెందిన లక్ష్మన్న, రంగమ్మ దంపతుల కుమారుడు సంతోష్ కుమార్ ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం గుత్తికి రైల్లో వచ్చాడు. తాను గుత్తి రైల్వే స్టేషన్‌లో ఉన్నానని, వేరే వారి ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు చెప్పాడు. వారు హుటాహుటిన గుత్తికి వచ్చారు. అయితే సంతోష్ కుమార్ కనిపించలేదు. వారి ఫిర్యాదు మేరకు బాలుడు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ నాగమాణిక్యం తెలిపారు.

'అర్హులకు అన్యాయం చేయొద్దు'

గుంతకల్లు రూరల్: జగనన్న ప్లాట్ల రద్దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి ఇతర నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుంతకల్లు పట్టణంలో దాదాపు 6 వేల మందికి జగనన్న ప్లాట్లు ఇచ్చారని, ఎక్కువ శాతం నిరుపేదలు నిర్మాణలు చేపట్టలేదన్నారు. నిర్మాణాలు చేపట్టని స్థలాలను రద్దు చేస్తామంటూ వీఆర్వోల ద్వారా లబ్ధిదారులకు నోటీసులు అందజేస్తున్నారన్నారు. నిరుపేదల కష్టాలు, ఇళ్లులేని వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు.

ప్రేమ విఫలం.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్: ప్రేమ విఫలమై తాడిపత్రి మండలం ఆలూరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి నవీన్‌కుమార్ (19) ఆత్మహత్య చేసుకున్నాడని సోమవారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పట్టణ సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న నవీన్‌కుమార్ ఆదివారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ఆస్పత్రికి తరలించగా... పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాడిపత్రి పోలీసులపై ఎస్పీకి ఫిర్యాదు

తాడిపత్రిటౌన్: తాడిపత్రిటౌన్ స్టేషన్ పోలీసులపై పట్టణంలోని నందలపాడుకు చెందిన హేమంత్‌కుమార్‌రెడ్డి సోమవారం జిల్లా ఎస్పీకి, నేషనల్ హ్యూమన్‌రైట్స్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. గత నెల 31న తాడిపత్రి పట్టణంలోని నందలపాడు లో వినాయక మండపం వద్ద కాలనీకి చెందిన నవశేఖర్ అనే యువకున్ని పోలీసులు కొట్టడాన్ని హేమంత్‌కుమార్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. దీంతో హేమంత్‌ను పోలీసులు బలవంతంగా జీపులో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచక్షణారహితంగా కొట్టడంతో పాటు మలద్వారంలోకి లాఠీ జొప్పించడంతో తీవ్రగాయమైంది. మలద్వారం దగ్గర ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారన్నాడు. పీఎస్ఐ నరసింహారెడ్డి, కానిస్టేబుల్ గోవిందు, హోంగార్డు నాగప్ప, కొంతమంది స్పెషల్ పార్టీ పోలీసులపై జిల్లా ఎస్పీతోపాటు ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు.

ఒకే స్థలానికి ఇద్దరికి పట్టాలు ఇస్తే ఎలా?

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఆటోనగర్ వెనుక ఉన్న ప్రభుత్వ భూమిలో ఒకరికి కేటాయించిన ఇళ్ల పట్టాను మరొకరి కేటాయిస్తే ఎలా అంటూ సోమవారం పలువురు మహిళలు తహసీల్దార్ సోమశేఖర్‌తో మొరపెట్టుకున్నారు. 2005లో రెవెన్యూ అధికారులు పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. 2018లో ఆ పట్టాలను రద్దు చేసి.. వాటి స్థానంలో మరికొంతమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి పాత, కొత్త లబ్ధిదారుల మధ్య వివాదం చోటుచేసుకుంది. తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డులను పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని వారికి సర్దిచెప్పి పంపించారు.

ఎస్సీ కాలనీల అభివృద్ధిపై నిర్లక్ష్యం

పుట్లూరు: ఎస్సీ కాలనీల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య ఆధ్వర్యంలో సోమవారం తక్కళ్లపల్లి గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. తక్కళ్లపల్లి ఎస్సీ కాలనీలో మురుగు కాలవలు నిర్మించాలని, వీది లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. వర్షం వస్తే కాలనీలో నీరు నిల్వ ఏర్పడి కాలనీ వాసులు రోగాలబారిన పడుతున్నారన్నారు. కాలనీలో కంపచెట్లు పెరిగి విషసర్పాల బెడద ఎక్కువైందన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటశివ, ఓబుళపతి, నడిపినారాయణ, వెంకటేష్, పాండు, నాగరాజు, ప్రభాకర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీలర్లపై చర్యలు తీసుకోండి

యాడికి: బియ్యం తక్కువ తూకాలు వేస్తున్న మండలంలోని రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమ్మద్ రఫీ, వెంకట రాముడు యాదవ్ తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

నేడు వైఎస్ వర్ధంతి కార్యక్రమం



తాడిపత్రి టౌన్: తాడిపత్రి పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు.

జయప్రదం చేయండి

శింగనమల/బుక్కరాయసముద్రం/గార్లదిన్నె/పామిడి/యాడికి: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం శింగనమల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నెలోని మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు పూల ప్రసాద్, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అలాగే పామిడిలో మంగళవారం నిర్వహించే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రమావత్ రామకృష్ణనాయక్ సోమవారం తెలిపారు. అదేవిధంగా యాడికిలో మంగళవారం నిర్వహించే వైఎస్సార్ వర్ధంతి వేడుకలు జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామి రెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు తెలిపారు. కార్యక్రమాలకు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తరలిరావాలని వారు కోరారు.

ముగిసిన టెన్నిస్ టోర్నీ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని టెన్నిస్ కోర్టులో డబుల్స్ విభాగంలో నిర్వహించిన టోర్నమెంట్ సోమవారం ముగిసింది. సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు ఎస్ఏ రాజన్, చక్రధర్, విజయ్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు టోర్నీ నిర్వహించారు. విన్నర్స్‌గా డాక్టర్ ఈ.వి. రెడ్డి- నాయక్, రన్నర్స్‌గా ఎస్ఏ రాజన్-ఎఎన్ మూర్తి నిలిచారు. అతిథులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రెండు దుకాణాల్లో చోరీ

తాడిపత్రి టౌన్: తాడిపత్రి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న సెల్ ఫోన్ , సెలూన్ దుకాణాల్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సెల్‌ఫోన్స్ దుకాణంలో మూడు సెల్ ఫోన్లు, సెలూన్ దుకాణంలో రూ.27 వేల నగదు చోరీ జరిగినట్లు బాధితులు వీర, రఘు తెలిపారు. పైకప్పునకు రంధ్రం చేసి దుండగులు దుకాణాల్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: వ్యసనాలకు దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సరోజినీ నాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ప్రగతి మైత్రి మహిళ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, క్షయవ్యాధి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు తదితర వ్యసనాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకరయ్య, ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, ఔట్ రిచ్ వర్కర్లు లక్ష్మీపతి, ఎలిజ, పీఈలు కృష్ణమూర్తి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.